ప్రజాశక్తి

సోమవారం 8 జులై 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

రక్షణ లేని జీవితాలు

- అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం
- ఇద్దరు కార్మికులు మృతి, 16 మందికి గాయాలు
- ఫ్యాక్టరీ ముట్టడికి గ్రామస్తుల యత్నం • బోదవాడలో ఉద్రిక్తత

ప్రమాదంలో గాయపడిన కార్మికులు

ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, విజయవాడ, జగ్గయ్యపేట

పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరడం కష్టంగా మారుతోంది. పరిశ్రమల్లో రక్షణా చర్యలు లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఫ్యాక్టరీల నిర్వహణా చట్టాన్ని, కార్మికుల భద్రతా చర్యలను సంబంధిత యాజమాన్యాలు పూర్తిగా గాలికొదిలేశాయి. ఫ్యాక్టరీల పర్యవేక్షణాధికారుల తనిఖీలు, పర్యవేక్షణ మచ్చుకైనా కనిపించడం లేదు. ఏదేని ప్రమాదం జరిగి, కార్మికులు మృత్యువాతపడిన సందర్భాల్లో ఒకటి, (మిగతా 2లో)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రశాంతంగా యుపిఎస్‌సి పరీక్ష

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్‌టిఆర్ జిల్లాలోని విజయవాడలో ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించిన ఈపీఎఫ్‌వో పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈపీఎఫ్‌వో పరీక్షకు సంబంధించి 2,401 మందికి, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులకు విజయవాడలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పిబి సిద్ధార్థ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ డా. జి.సృజన తనిఖీ చేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్‌వో-పర్సనల్ అసిస్టెంట్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్ష జరిగాయి. ఈపీఎఫ్‌వో పరీక్షకు 526 మంది (21.91 శాతం), ఈఎస్ఐసీ పరీక్షకు 4,075 మంది (75 శాతం) హాజరయ్యారు. పరీక్షలను సజావుగా నిర్వహించడంలో భాగస్వాములైన సూపర్‌వైజర్లు, సహాయ సూపర్వైజర్లు, రూట్ కమ్ లైజనింగ్ అధికారులు తదితరులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

జరభద్రం!

- ప్రమాదాలకు నిలయంగా రహదారులు
- కృష్ణాలో రోజుకు రెండు ప్రమాదాలు సగటున ఒకరు మృతి
- ఈ ఏడాది ఇప్పటి వరకు 398 ప్రమాదాలు, మృతులు 177 మంది

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వాహన ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని పోలీసులు చెబుతున్న మాటలు ఆచరణలో నీటి మూటలవుతున్నాయి. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రమాదాలు తగ్గకపోగా పెరిగిపోతున్నాయి. ప్రమాదాల్లో అతివిలువైన ప్రాణాలు కోల్పోయే వారు, క్షతగాత్రులు అయ్యేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది ఆరు నెలల కాలంలో కృష్ణాజిల్లాలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఈ విషయాలు తేటతెల్లం అవుతున్నాయి. జనవరి ఒకటో తేదీ నుంచి జూన్ 30 వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 398 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 177 మంది మృతిచెందారు. 378 మంది క్షతగాత్రులయ్యారు. ఈ కాలంలో సగటున రోజుకు రెండు ప్రమాదాలు జరిగ్గా ఒకరు మృత్యువాత పడ్డారు. ఇద్దరు చొప్పున క్షతగాత్రులయ్యారు. జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న జాతీయ రహదారులపైనే ఎక్కువగా ప్రమాదాలు సంభవించాయి. నాలుగు జాతీయ రహదారులపై 190 ప్రమాదాలు జరగ్గా 97 మంది మృతిచెందారు. వాహనాలను అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదాలకు కారణంగా అధికారులు చెబుతున్నారు. (మిగతా 2లో)

వ్యాధుల నియంత్రణకు చర్యలు

- మంచినీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి
- 'ప్రజాశక్తి'తో ఎన్‌టిఆర్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి శివప్రసాద్

ప్రజాశక్తి-విజయవాడ

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుదలతో పాటు మంచినీరు సరఫరాపై దృష్టి సారించామని ఎన్‌టిఆర్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి (డిపిఒ) ఎన్‌వి శివప్రసాద్ తెలిపారు.. ఇటీవల కాలంలో కొన్ని పంచాయతీల్లో కలుషిత నీటితో పాటు తీసుకునే ఆహారంలో కూడా కల్తీ వల్ల కూడా వాంతులు, విరేచనాలతో అతిసార వచ్చే అవకాశం ఉందని, దాని నివారణకు జిల్లా కలెక్టర్ జి.సృజన, స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు, సలహా మేరకు గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో క్లీనింగ్, స్వీపింగ్, మంచిటి సరఫరా, డ్రైనేజి మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చేపట్టిన చర్యల గురించి ఆయన వివరించారు.



ప్రశ్న: వ్యాధుల బారిన పడకుండా జిల్లాలో తీసుకుంటున్న చర్యలేమిటి?

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సురక్షిత మంచినీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుదల, డ్రైనేజిల్లో సిల్టు తొలగింపు వంటి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతి పంచాయతీ పరిధిలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు (మిగతా 2లో)

అశ్రునివాళి

సమసమాజ స్థాపనకు
నమ్మిన సిద్ధాంతాన్ని
తుదిశ్వాస వరకు వీడకుండా
శ్రమజీవుల హక్కుల కోసం
పోరాడిన సోదరుడా... అప్పుడే
నీవు దూరమై ఏడాది అయ్యిందా...
నువ్వింకా మాతోనే ఉన్న భావన
కలుగుతుంది. నీ ఆశయ సాధనకు
కృషి చేస్తామని బాస చేస్తూ...
మా అశ్రు నివాళులు...

కామ్రేడ్ మురాల రాజేష్ గారు
జననం : 25-12-1988 మరణం : 08-07-2023

పంతగాని సురేష్
పి.వి.రావు మాలమహానాడు
కృష్ణాజిల్లా అధ్యక్షులు. 9676493637

మొదటిపేజీ తరువాయి

రక్షణ లేని జీవితాలు

రెండు రోజులు అధికారుల హడావుడి తప్ప మిగిలిన రోజుల్లో పూర్తిగా విస్మరించడంతో ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. దీని ఫలితంగానే జగ్గయ్యపేట మండలం బోదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం జరిగిన ఘోర ప్రమాదంలో 16 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో బోదవాడ గ్రామానికి చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులూ ఉన్నారు. విజయవాడలోని మణిపాల్, ఆంధ్రా ఆసపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న కలెక్టర్ జి.సృజన పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఉన్న బాధిత కుటుంబాలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు పరామర్శించి వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఇద్దరు కార్మికుల మృతితో బోదవాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఫ్యాక్టరీ ముట్టడికి గ్రామస్తులు యత్నించారు. రాళ్ల విసరడంతో సిఐకు గాయాలయ్యాయి. గ్రామస్తులు ఎవరూ లోపలికి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు.

బోదవాడలోని అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ఆదివారం ఉదయం షిఫ్ట్‌లో మొత్తం 20 మంది కార్మికులు పని చేస్తుండగా ఉదయం 10.40 గంటల సమయములో పైపులేక్ అయ్యి పగిలిపోయింది. దీంతో వేడి సిమెంట్ మొత్తం కార్మికుల మీద పడిపోయి ఒక్క సారిగా కార్మికుల శరీరాలు, అవయవాలన్నీ కాలిపోయాయి. ఒక్క సారిగా కార్మికుల ఆర్తనాదాలు ఫ్యాక్టరీలో మిన్నంటాయి. అత్యంత వేడి సిమెంట్ దెబ్బకు శరీరంలోని అవయవాలన్నీ కాలిపోతూ కార్మికులు తల్లడిల్లిపోయారు. ఎక్కడికక్కడ కుప్పకూలిపోయారు. పలువురు కార్మికులు వేడికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. మాట, పలుకు ఏమి లేకుండా పోయింది. ఒక్క సారిగా ఏమి జరుగుతుందోనని చుట్టుపక్కల కార్మికులు ఒక్క సారిగా భీతిల్లిపోయారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకోవడానికి కారణమని స్వయంగా క్షతగాత్రులైన కార్మికులు వెల్లడిస్తున్నారు. పైప్ లీకవుతున్న విషయాన్ని గత పది రోజులక్రితమే సదరు కార్మికులు సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెప్పినా...పట్టించుకోలేదని, ఫలితంగా ఈఘటన చోటు చేసుకున్నట్లు పలువురు కార్మికుల కుటుంబాలకు చెందిన పలువురు మహిళలు కన్నీరు, మున్నీరు అవుతూ జిల్లా అధికారులకు, సిఐటియు నాయకులకు వెల్లడించడం గమనార్హం. కనీసమైన జాగ్రత్తలు, ఫ్యాక్టరీ చట్టం నిబంధనలు అమలు మచ్చుకైనా కనిపించడం లేదు. అల్ట్రాటెక్ సిమెంట్స్ లాంటి నిబంధనలు పాటించని ఫ్యాక్టరీలు ఎన్‌టిఆర్ జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయని, ఫలితంగా ఇటీవల కాలంలోనే అనేక మంది కార్మికులు మృత్యువాత పడిన సంఘటనలను కార్మిక సంఘాల నేతలు, బాధిత కుటుంబాలు వెల్లడిస్తున్నారు. మొన్నటి వరకు ఉమ్మడి కృష్ణాజిల్లా, ప్రస్తుం ఏలూరు జిల్లాలో ఉన్న అక్కిరెడ్డి గూడెం ఫార్మా కంపెనీలో జరిగిన ఘోరమైన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు మృత్యువాతపడిన సంఘటన ఆ నాడు తీవ్ర సంచలనం సృష్టించింది. అలాగేగతంలో పరిటాల లైట్ వైట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో యాక్సిడెంట్ జరిగిన ఒక కార్మికుడు మృతి చెందాడు. యంత్రాల మధ్యలోనే కార్మికులు ప్రాణాలు వదులుతున్నారు. ఫ్యాక్టరీల్లో ఎటువంటి ఆడిట్ ఉండటం లేదు. జిల్లాలోని పలు సిమెంట్ ఫ్యాక్టరీలు, ఫార్మా ఇంజినీరింగ్, విత్తనాల తయారీ, ఇథనాల్ ఫ్యాక్టరీ ఇలా జిల్లాలో అనేక ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. వీటన్నింటిలో సుమారు 75 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. కార్మికుల శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతుంది. వేతనాలు అతి తక్కువుగా ఇస్తారు. పని గంటలుండటం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు కన్నెత్తి కూడా చూడని వైనంగా తయారయింది. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చినఫ్యాక్టరీ చట్టం సవరణల ప్రకారం అధికారుల తనిఖీ ఫర్స్‌పెక్టుతాలేసినట్లుగా మోడీ ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావడం జరిగింది. పని చేసే కార్మికులకు అనుకూలంగా లేక, శ్రమదోపిడీ చేసే యాజమాన్యానికి అనుకూలంగా ఫ్యాక్టరీ చట్టాలు రూపొందుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో ఫ్యాక్టరీల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్నారు. కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయినా, వారి కుటుంబాలు వీధుల పాలయినా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.

ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలి

ఇన్‌ఛార్జి కమిషనర్‌కు సిఐటియు వినతి

ఇన్‌ఛార్జి కమిషనర్‌తో మాట్లాడుతున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-విజయవాడ: విఎంసిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించే అధికారి కనిపించడం లేదని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మునిసిపల్ కార్మికుల సమస్యలపై నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్, అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ.మహేష్‌కు యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని వేతనాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. కార్మికులు అనారోగ్యం వల్లనో, ప్రమాదవశాత్తు మృతిచెందితే సంబంధిత కుటుంబం ఎటువంటి ఆదరణ లేక వీధుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, కంపెనీలతో మాట్లాడి కార్మికుల తరుపున ప్రీమియం డబ్బులను కార్పొరేషన్ చెల్లించాలని కోరారు. పార్కులు, వెహికల్ డిపో డ్రైవర్లు, మెకానిక్స్, వాటర్ సప్లై వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ పెరిగిన ధరలకనుగుణంగా, సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందం మేరకు రూ.21 వేలు వేతనం మంజూరు చేయాలని కోరారు. యూనిఫారమ్, సబ్బులు, నూనెలు, కొబ్బరినూనె, బట్టలు వెంటనే కార్మికులకు పంపిణీ చేయాలని కోరారు. ఏళ్ల తరబడి భర్తీ చేయకుండా ఉన్న కారుణ్య నియామకాలను సత్వరమే చేయాలన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కమిషనర్ సానుకూలంగా స్పందిసూ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు, నాయకులు చిన్న కిషోర్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మురాల రాజేష్ వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుడివాడ: వ్యవసాయ కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన నాయకులు మురాల రాజేష్ ప్రథమ వర్ధంతి సభ గుడివాడ సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు శీలం ప్రకాశరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో ప్రధాన వక్తలుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

నేడు ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

చెట్ల పెంపకంతో కాలుష్య నివారణ

ప్రజాశక్తి- భవానీపురం : పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా అందరూ చెట్లు నాటడం అలవర్చు కోవాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. ఆదివారం 42వ డివిజన్ హెచ్.బి. కాలనీలో వాటర్ ట్యాంక్ వద్ద అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో సుజనా చౌదరి పాల్గొన్నారు. స్థానికులు ఎంఎల్ఎ దృష్టికి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యను తీసుకొచ్చారు. వాన పడితే చాలు తమ ఇళ్లల్లోకి డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతోందని స్థానిక మహిళలు తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగ అధికారులతో మాట్లాడి డ్రైయినేజీ సమస్య పరిష్కరిస్తానని సుజనా హామీ ఇచ్చారు.

ఆషాఢం సారె

ప్రజాశక్తి - వీరులపాడు : నరసింహారావు పాలెంలో అగస్త్య పీఠంలో ఆదివారం ఉదయం 9 గంటలకు గాయత్రీ దేవికి సారె సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపుగా వైభవోపేతంగా జరిగినట్లు పీఠాధిపతులు సుగుణానంద స్వామీజీ తెలిపారు. అనంతరం దేవాలయం ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, జుజ్జూరు గ్రామ ఉపసర్పంచి పసుపులేటి సాయిబాబా తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ప్రజలకు అవగాహన ఎలా కల్పిస్తున్నారు?

వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకునే చర్యలు, జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అధికారులు కూడా సమన్వయంతో పని చేయడం జరుగుతుంది. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి అన్నం భుజించాలి. వ్యాధులు రాక ముందు, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన కర్తవ్యాలపై పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది.

ప్రశ్న: జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో తీసుకున్న చర్యలేమిటి?

ఆయా గ్రామాల్లో అతిసారం దృష్టిలో ఉంచుకుని, ప్రధానంగా రక్షిత మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రూరల్ 16 మండలాల పరిధిలోని 288 గ్రామ పంచాయతీలుండగా, వీటి పరిధిలోని 542 ఓవర్ హెడ్ ట్యాంక్‌లను (ఒహెచ్‌ఎస్ఆర్) క్లీనింగ్ చేయించడం, మోతాదుకనుగుణంగా బ్లీచింగ్ కలిపి వాటర్ క్లోరినేషన్ చేయడం, పైప్‌లైన్ల బాగు చేయించడం తదితర చర్యలు చేపట్టాం.

ప్రశ్న: పారిశుధ్య మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

పంచాయతీల్లో పారిశుధ్య మెరుగుదలకు పలు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా వీధుల్లో స్వీపింగ్, డ్రైయిన్ల క్లీనింగ్, సిల్టు తొలగింపు చర్యలు తీసుకుంటున్నాం. డ్రైయిన్లలో లార్వా నిర్మూలనకు, దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుంది. పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణకు మూడు చక్రల బండ్లు 552 వినియోగించడం జరుగుతుంది. వీటితో పాటు 243 గ్రీన్ ఆటోలు పని చేస్తున్నాయి. 1077 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్త నుంచి కంపోస్టు ఎరువు తయారీకి ప్రత్యేక ప్లాంట్స్ ద్వారా ఉత్పత్తి చేయడం జరుగుతుంది.

ప్రశ్న: పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూలు ఎంత వరకు వచ్చింది?

ఇప్పటి వరకు 75 శాతం నుంచి 80 శాతం వరకు పన్నుల వసూలు జరిగింది. మిగిలిన పన్నుల బకాయిలు మరో పది రోజుల్లోపు పూర్తి చేయడం జరుగుతుంది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఉన్న 16 మండలాల్లో సుమారుగా రూ.115 కోట్ల వరకు పన్నుల రాబడి ఉండగా, ఇప్పటి వరకు 80 శాతం వరకు వసూలు జరిగింది. ఇంటి పన్నులు, నీటి పన్నులు, డ్రైనేజి పన్ను, లైబ్రరీ సెస్, అద్దెలు, గిఫ్టల రూపంలో ప్రతి పంచాయతీకి పలు రూపాల్లో రాబడి వస్తుంటుంది. మండలానికి రూ.7 కోట్లకు పైగా పన్నుల ద్వారా రాబడి ఉంటుంది. అయితే వీటిని పంచాయతీల్లో ఉద్యోగుల ద్వారా వసూలు చేయకుండా అందుబాటులోకి వచ్చిన కంప్యూటర్ టెక్నాలజీ ద్వారా క్యాష్ లెస్ ట్రాన్సాక్షన్ (క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా బ్యాంక్‌లకు జమ చేయడం) జరుగుతుంది. దీని ద్వారా ఎక్కడా అక్రమాలు, డబ్బు జమ కాకుండా ఉండే అవకాశం ఉండదు.

జర భద్రం !

ఈ నేపథ్యంలో రోడ్డెక్కాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడుతోంది.

నాలుగు జాతీయ రహదారులపై...

కృష్ణాజిల్లాలో 1500 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రహదారులు, 250 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. నాలుగేళ్ల కాలంలో జాతీయ రహదారులను విస్తరించారు. ఆధునీకరించారు. దీంతో ఈ రోడ్లపై కొందరు వాహనదారులు 100 నుంచి 130 కిలో మీటర్ల వేగంతో వాహనాలు నడుపుతున్నారు. అతి వేగం ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ కాలంలో జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న కత్తిపూడి-ఒంగోలు జాతీయరహదారి (ఎన్‌హెచ్) 216పై 49 ప్రమాదాలు జరగ్గా 25 మంది మృతి చెందారు. 56 మంది గాయపడ్డారు. పెడన- నూజివీడు ఎన్‌హెచ్ 216పై 28 ప్రమాదాలు జరగ్గా 16 మంది మృతిచెందగా 20 మంది గాయపడ్డారు. చెన్నై -కోల్‌కత్తా ఎన్‌హెచ్ 16పై 43 ప్రమాదాలు జరిగ్గా 29 మంది మృతిచెందగా 29 మంది గాయపడ్డారు. మచిలీపట్నం-పూనే ఎన్‌హెచ్ 65పై 70 ప్రమాదాలు జరగ్గా 27 మంది మృతిచెందారు. 67 మంది గాయపడ్డారు.

రెండు ప్రమాదాల్లో 11 మంది మృతి

చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి 16పై బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామం వద్ద ఈ ఏడాది మే 27వ తేదీన జరిగిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి 216పై కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద జూన్ 24వ తేదీన జరిగిన ప్రమాదంలో అశోక్‌లైలాండ్ వాహనంపై వెళుతున్న ఆరుగురు మృతిందారు. మరో ఐదుగురు క్షతగాత్రులయ్యారు. ఈ రెండు ప్రమాదాల్లోనే 11 మంది మృతిచెందారు. ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి ఈ రెండు ప్రమాదాలు జరిగాయి.

61 బ్లాక్ స్పాట్లు

కృష్ణాజిల్లాలో అత్యధికంగా ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించారు. 61 బ్లాక్ స్పాట్లలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

అద్నాన్ నయీం అస్మి, ఎస్‌పి

ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నాం. వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ఓవర్ లోడ్ ప్యాసింజర్‌తో వెళుతున్న వాహనాలను నిలిపివేస్తున్నాం. బ్లాక్ స్పాట్ల వద్ద వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాద సూచికలను ఏర్పాటు చేశాం.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : కొల్లు

సమస్యలు వింటున్న మంత్రి కొల్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రతి అర్జీదారుని సమస్య స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ జల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.ఆదివారం స్థానిక నియోజకవర్గ కార్యాలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీదారుని సమస్య మంత్రి సావధానంగా ఆలకించి వారి సమస్యలు పరిష్కరించ చేయుటకు సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కార చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. సుమారు 7 గంటల సమయం కేటాయించి అర్జీలు స్వీకరించారు. మొత్తం 500 వందలు అర్జీలు వచ్చినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజా సమస్యలు గాలికి వదిలేసారని, తమ ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రతి శని ఆదివారాల్లో ఒకరోజు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన అర్జీలలో వారి సమస్యలు ఎంతవరకు పరిష్కారం అయ్యాయి పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందన్నారు. వినియోగదారులే సీనరేజీ, లోడింగ్ చార్జీలు కట్టి తెచ్చుకోవచ్చని, ఈ విధానం వల్ల రాష్ట్రంలో నిర్మాణ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ ఇంఛార్జి బండి రామకృష్ణ, టిడిపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం అభివృద్ధే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్) : గడచిన పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. హనుమాన్ జంక్షన్ లో శనివారం రాత్రి 12 గంటలకు జరిగిన సభలో యార్లగడ్డ వెంకట్రావు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గన్నవరం నియోజక వర్గంలోని సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కషి చేస్తానని వెంకట్రావు హామీ ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గంలోని మల్లవల్లి పారిశ్రామిక వాడలో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటుకు కషి చేస్తున్నట్లు చెప్పారు. విమానాశ్రయం ఎదురుగా వున్న ప్రభుత్వభూమిలో ఐటి సంస్థలు ఏర్పాటు చేసి తీరుతానని చెప్పారు. నియోజకవర్గంలో పారిశ్రామిక అభివద్ధి చేసి 20వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలమలశెట్టి రమేష్ బాబు, కొల్లా ఆనంద్, ఆళ్ళ గోపాలకష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమా ప్రసాద్, మూల్పూరి సాయి కళ్యాణి పాల్గొన్నారు.

మందుల పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీ పోరంకి నియోజకవర్గ కార్యాలయంలో అనుమోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ పాల్గొని మందులు పంపిణీ చేశారు. ఆయనతోపాటు తాడిగడప మునిసి పాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రికి రావూరి పురస్కారం

సింహాద్రి పద్మకు రావూరి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : నిరుపేద కుటుంబం నుండి జన్మించిన రావూరి భరద్వాజ అక్షరం అంత మాత్రమైన జాతీయ స్థాయిలో జ్ఞానపీఠ్ అవార్డ్ పొందడం తెలుగు వారి కీర్తి ప్రతిష్టలను మరోసారి విశ్వ వ్యాప్తం చేసిందని శ్రీ గాయత్రి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు చింతలూరి ఉమాదేవి పేర్కొన్నారు. తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యాన స్థానిక శ్రీనివాస మహల్ సెంటర్ లోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కీర్తిశేషులు డా.రావూరి భరద్వాజ 97వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమాదేవి మాట్లాడుతూ భరద్వాజ జీవిత విశేషాలను మరింత విస్తతం చేసి ఆయన రచనలపై అధ్యయనం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డకు చెందిన ప్రముఖ రచయిత్రి సింహాద్రి పద్మకు కీర్తిశేషులు రావూరి భరద్వాజ సాహితీ స్ఫూర్తి పురస్కారం 2024ను అంద జేశారు. విశిష్ట అతిథులుగా భవిరి శంకర్ నాథ్, వసుధ బసవేశ్వ రరావు, మోకా మాధవరావు, గాదె మోహన్ బాబు డా.ప్రియాంక పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషా వికాస సమితి సమన్వయ కర్త డి ఆర్ బి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు చింతలూరి సత్యనారాయణ, గుసుకుల మాల్యాద్రి, డా.పి.శ్రీనుబాబు, కొండవీటి లీలా ప్రసాద్, మాటూరి రంగనాథ్, లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, అర్జా ప్రసాద్, ఆదిరాజు వెంకటేశ్వరరావు, రేమండ్ పీటర్, నూలు సాంబశివరావు, కిషోర్, పెదమల్లు గోపాలకష్ణ మూర్తి, పిన్నమనేని వేణుగోపాలరావు, వీర బ్రహ్మేంద్ర స్వామి పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

చల్లపల్లిలో...

గుడ్లవల్లేరులో...

ప్రజాశక్తి-చల్లపల్లి : దేశంలో సామాజిక ఉద్యమాలకు దిక్సూచి మందకష్ణ మాదిగ అని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ అధినేత మందకష్ణ మాదిగ 60వ జన్మదినోత్సవ కార్యక్రమాన్ని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం పక్షాన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవరపల్లి సురేష్ బాబు మాట్లాడుతూ 30ఏళ్ళుగా నిరంతర సుదీర్ఘ ఉద్యమాల ద్వారా అనేక సామాజిక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన సామాజిక ఉద్యమనేతగా కష్ణ మాదిగ మాదిగ చరిత్రలో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మట్ట రాజా,కొక్కిలిగడ్డ రమేష్ బాబు, దేవరపల్లి కోటయ్య,మట్ట రాజు,సిద్దేల యలమందయ్య, కొడాలి అనిల్ పాల్గొన్నారు. అలాగే మాదిగరిజరేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మరిన్ని పుట్టినరోజు జరుపుకోవాలని, ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ కోరారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లిలో మంద కృష్ణ పుట్టినరోజు వేడుకలు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మంద కష్ణ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాదుల చిత్రపటానికి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, టి.ఎన్.టి.యూ.సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి చంద్రశేఖర్ (చిట్టి), ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు కొక్కిలిగడ్డ నవీన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బుల్లా కింగ్ త్యాగరాజు మాదిగ ఆధ్వర్యంలో స్థానిక సెంటర్లో కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల నాగబాబు, మండల టిడిపి నాయకులు వెనిగళ్ళ నాగేశ్వరరావు, రహీమ్ ఖాన్, రాయల ప్రభాకర్, వేమవరపు రమేష్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పాల్గొన్నారు. ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం 19 వ డివిజన్ మల్లపట్నం గుప్తా సెంటర్ లో ఉన్న డా.బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఎం ఆర్ పి ఎస్ జెండా ఆవిష్కరించారు. డా.భానుమూర్తి , కొమ్ము ప్రసాద్ లాయర్ ఆదేపల్లి నిరంజన్ ఎం ఎస్పి కష్ణాజిల్లా అధ్యక్షులు కొల్లూరి బసవ మాదిగ, బిడెల్లి మరియు కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-గూడూరు : విజయవాడ నుండి మచిలీపట్నం వస్తున్న కారు గూడూరు మండలం గూడూరు అడ్డరోడ్డు ఇసుక కాలువ వద్ద బోల్తా కొట్టడం తో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అటుగా వెళుతున్న మచిలీపట్నం జనసేన ఇంచార్జి బండి రామకష్ణ స్పందించిప్రజలను అప్రమత్తం చేసి కారు నుండి దెబ్బలు తగిలిన వారిని బయట తీశారు. సమాచారం అందుకున్న గూడూరు పోలీసులు క్షతగాత్రులను బందరు సర్వజన ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మారేడుమాక గ్రామం లో పవర్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం అంగరంగ వైభవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, పెనమలూరు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పారాజు , ఎంపీపీ నెరుసురాజ్యలక్ష్మి, సుధిమేళ్ల రవీంద్ర, జుజ్జువరపు చంటి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న తోట శ్యామ్‌కిషోర్ నాయుడు

అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు అమ్మమ్మ పోషడువు మహాలక్ష్మమ్మ వర్ధంతిని పురస్కరించుకొని వద్దులకు, వికలాం గులకు, నిరుపేదలు సాధువులకు అన్నదానం నిర్వహించారు, ఆదివారం రాజీవ్ సెంటర్లోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామ్ కిషోర్ నాయుడు తోట శ్యామ్ కుమార్ పాల్గొని వారికి అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని శిరిడి సాయి అన్న ప్రసాద్ నిర్వాహకులు చిట్టా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది

ఇటుబాయ్‌కు నివాళి

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలం రైతు సంఘం సీనియర్ నాయకుడు నీలం మురళీకృష్ణరెడ్డి అత్త సరిపల్లి ఇటుబాయ్ (80) పెదపారుపూడి మండలం మహేశ్వర పుర గ్రామంలో శనివారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఆదివారం భౌతిక గాయాన్ని సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్పిపి రెడ్డి. ఐద్వా గుడివాడ పట్టణ కార్యదర్శి రజిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచి రాజు ఆదివారం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత డొల్ల..!

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు, ఫ్యాక్టరీస్‌శాఖ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించడం సమస్యగా మారింది. దీంతో గత కొన్నేళ్లగా ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు శాశ్విత వైకల్యానికి గురయ్యారు. ఈ క్రమంలోనే పరిశ్రమల్లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన జిల్లా పరిశ్రమలశాఖ వైఫల్యం చర్చనీయాంశమవుతోంది. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆప్ ఫ్యాక్టరీస్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్స్ రెగ్యులర్‌గా పరిశ్రమలను తనిఖీలు చేయాలి. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలకు కారణంగా ఉండే పరికరాలను వాటిని క్షణంగా పరిశీలించాలి. కాలం చెల్లిన యంత్రాలు, బాయిలర్లు పైప్‌లైన్‌లు స్థానంలో నూతన పరికరాలు అమర్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఈ పరిస్థితి లేకపోవడంతో తాజాగా జగ్గయ్యపేట మండలం బూదవాడ వద్ద సిమెంట్ ప్యాక్టరీలో ప్రమాదానికి దారితీసింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో 13 మంది చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ప్రమాదకరమైన పైప్‌లైన్ లీకేజీ గురించి కార్మికులు ముందుగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ఘటనలే కాదు... 2023లో ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్)లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు. జగ్గయ్యపేట ప్రాంతంలోని సిమెంట్ కంపెనీల్లో ఎనిమిదేళ్లకాలంలో జరిగిన ప్రమాదాల్లో పది మందికిపైగా మృతి చెందారు. ముత్యాల సమీపంలోని ఫార్మా కంపెనీల్లో ఏడు సంవత్సరాల్లో జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. గతంలో కొండపల్లి కెమికల్ ఇండస్ట్రీయల్ బాయిలర్ పేలిన ఘటనలో ముగ్గురు చనిపోయారు. గన్నవరం మండలం సూరంపల్లిలో జిఎస్ ఫెలో ఎల్లాయ్ పరిశ్రమలో బాయలర్ పేలిన ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

కార్మికుల రక్షణకు చర్యలు ఏవీ?

పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలను రక్షించడానికి తీసుకోవాల్సిన రక్షణాత్మక చర్యలపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించడం లేదు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పినా అవి ఆచరణలోకి రావడం లేదు. పెట్టుబడులు, పరిశ్రమలు, సరళతర వ్యాపారాల గురించి ప్రభుత్వాలు మాట్లాడుతున్నాయి. పొట్టకూటి కోసం పరిశ్రమల్లో అరకొర వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల రక్షణ గురించి పట్టించుకోకపోవడంతోనే పారిశ్రామిక ప్రమాదాలు పెరిగిపోతున్నాయనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లోనూ, వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత

సిఐ నరసింహమూర్తి తలకు గాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బుదవాడ గ్రామ సమీపంలో గల అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇరువురు మృతి చెందడంతో గ్రామస్తులు సిమెంట్ ఫ్యాక్టరీని ముట్టడించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగివాదం జరిగింది. గ్రామస్తులను ఫ్యాక్టరీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు నందిగామ ఎసిపి డాక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను అడ్డుకున్న పోలీసులు ఒక్కసారిగా సహనం కోల్పోయి పోలీసులపై రాళ్లు రువ్వారు. దీంతో సిఐ నరసింహమూర్తి తలకు గాయమైంది. జగ్గయ్యపేట సిఐ జానకిరామ్ కాలర్ పట్టుకుని నిరసనకారులు నిలదీశారు. ఒక ఎస్ఐకి సైతం గాయాలైనట్ల తెలుస్తుంది. ఒక్కసారిగా పరిస్థితి విషమించటంతో పోలీసు ఉన్నతాధికారులు ఫ్యాక్టరీ వద్దకు పోలీస్ అదనపు బలగాలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామస్తులు మృతుల కుటుంబాలకు, గాయపడ్డ కుటుంబాలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఇంత జరుగుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడం విచారకరమని గ్రామస్తులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ గ్రామస్తులు, బాధిత కుటుంబీకులు సమన్వయం పాటించాలని కోరారు. నందిగామ ఎసిపి డాక్టర్ రవికిరణ్‌ను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారమివ్వాలి

క్షతగాత్రులను పరామర్శించిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ : బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు ఆవుల వెంకటేష్ (36) కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వడంతో పాటు ప్రాణాపాయం స్థితిలో ఉన్న మిగిలిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. కార్మికులందరికీ మెరుగైన వైద్యం కోసం తక్షణం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించాలని, సిఐటియు నాయకులంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్‌తాతయ్యకు సలహా ఇచ్చామని చెప్పారు. ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకున్న సమయములో వైద్యచికిత్స కోసం బరన్ యూనిట్ విజయవాడలో లేదని, ఇటువంటి పరిస్థితుల్లో వెంటనే హైదరాబాద్‌కు తరలించాల్సిన అవసరం ఉందని అన్నారు. నర్సింగరావుతో పాటు సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సి హెచ్.శ్రీనివాస్ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులు చికిత్స పొందుతున్న విజయవాడలోని ఆంధ్రా ఆస్పత్రి, మణిపాల్ ఆస్పత్రి వద్దకు నాయకులు వెళ్లి కార్మికులకు అందుతున్న వైద్యం పరిస్థితిపై సదరు డాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారమివ్వాలని, మిగిలిన 15 మంది కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరేడు మంది కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, ఇతర అధికారులను కోరినట్లు నాయకులు తెలిపారు. ప్రమాదంపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరారు. ఈ క్షతగాత్రులను పరామర్శించిన నాయకుల్లో సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

బాధితులను పరామర్శించిన పోలీస్ కమీషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ

నగర పోలీస్ కమీషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ ఆంధ్రా హాస్పిటల్, మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 16 మంది అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ క్షతగాత్రులను పరామర్శించి వారికి వైద్యం అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి వివరాలు తెలుకున్నారు. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులతో, బంధువులతో మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందుతుందని వీలైనంత త్వరగా కోలుకునే అవకాశం ఉందని, ఘటనపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని సిపి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు, బంధువులకు హాస్పిటల్ సమీపంలోనే బస చేసేందుకు వీలుగా కనీస వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్‌తో క్షతగాత్రుల విషయంపై మాట్లాడారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం : కలెక్టర్ డా. జి.సృజన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : జగ్గయ్యపేట మండలం, బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రత్యేక వైద్య బృందాలు ఇందుకోసం కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సృజన తెలిపారు. తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి, గొల్లపూడి ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సృజన పరామర్శించారు. ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆంధ్రా హాస్పిటల్‌లో 8 మంది, మణిపాల్ ఆసుపత్రిలో 8 మంది చికిత్స పొందుతున్నారని.. 16 మందిలో అయిదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ప్రత్యేక వైద్య బృందాలతో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారి బంధువులతోనూ మాట్లాడారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందని భరోసా కల్పించారు. ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదికలను అనుసరించి బాధ్యులపై చట్టపర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన వారుకాగా.. పల్నాడు జిల్లాకు చెందిన వారు ఒకరు ఉన్నారన్నారు. అయిదుగురు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు కాగా, ఒకరు జార్ఖండ్, మరొకరు బీహార్‌కు చెందిన వారు ఉన్నట్లు వివరించారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు ఉన్నారు.

ప్రమాదానికి కారణమైన యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలి

అల్ట్రా టెక్ సిమెంట్స్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు పశ్చిమ సిటీ ప్రధాన కార్యదర్శి ఇవి నారాయణ, నాయకులు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. వారు ఆదివారం క్షతగాత్రులకు అందుతున్న వైద్యం, వారి పరిస్థితిని బాధిత కుటుంబ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అత్యున్నత వైద్యం అందేలా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోరారు. గతంలో ఫ్యాక్టరీలో అనేక ఘటనలు జరిగిన యాజమాన్యం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. ఆంధ్రా హాస్పిటల్, మణిపాల్ హాస్పిటల్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అధికారులతో మాట్లాడారు.

20 కుటుంబాల్లో విషాదం

ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం

విషాదంలో ఆంధ్రా ఆసుపత్రి వద్ద క్షతగాత్రుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - భవానీపురం : జగ్గయ్యపేట రూరల్ మండల పరిధిలోని బుదవాడ గ్రామంలో సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం జరిగిన పేలుడు ఘటనలో 20 మంది కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. అయితే అందులో 8 మందిని విజయవాడ గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రికి తరలించి ఎమర్జెన్సీ క్యాజువాల్టీలో చికిత్స అందిస్తున్నారు. ఆంధ్రా ఆసుపత్రి వద్ద క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఆందోళనలో మునిగిపోయారు. ముఖ్యంగా గుగులోతు గోపీనాయక్ (34)కు 50 శాతం పైగా తీవ్ర గాయాలు కాగా, బొంతా శివనారాయణ (45)కు 70 శాతం పైగా కాలిపోయి గాయాలపాలయ్యాడు. బాణావత్ సైదా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యుల సమాచారం మేరకు జిల్లా కల్టెక్టర్ సృజనా మీడియాకు తెలిపారు. ఆంధ్రా ఆసుపత్రి వద్ద క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఆందోళనలో ముగినిపోయారు. ఈ సంద్భంగా 'ప్రజాశక్తి' వద్ద బాధిత కుటుంబ సభ్యులు తమ భావోద్వేగాలను వెలిబుచ్చారు.

కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలి : గుగులోతు గోపీనాయక్ భార్య రోజా

మా భర్త గుగులోతు గోపీనాయక్ గత పది సంవత్సరాలుగా జగ్గయ్యపేట అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నారు. మాకు కుమారుడు, కుమార్తె చిన్నపిల్లలు ఉన్నారు. 50 శాతం పైగా గాయాలైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. కంపెనీ యాజమాన్యమే మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

కంపెనీ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణం : గుగులోతు బాలాజీ భార్య స్వాతి

వారం రోజులుగా కిలన్‌లో లోడ్ ఎక్కువ కారణంగా లీకవుతోందని చెప్పినా యాజమాన్యం పట్టించుకోకపోవ వల్లే నేడు ఇంత ఘోరం జరిగింది. దీనికి బాధ్యత సిమెంట్ ఫ్యాక్టరీదే. తన భర్త గుగులోతు బాలాజీ ఏడేళ్లుగా కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నారు. ఇంత జరిగితే యాజమాన్యం పట్టించుకోకపోవటం బాధాకరం.

కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కుటుంబీకులతో మాట్లాడుతున్న డి.వి.కృష్ణ, తదితరులు

బాధితుల బంధువులతో మాట్లాడుతున్న సిపి రామకృష్ణ, ఎంఎల్ఎ రాజగోపాల్

ప్రమాదం జరిగిన తీరుపై చర్చిస్తున్న పోలీసులు

ఫ్యాక్టరీలో ధ్వంసమైన పరికరాలు

చినుకు కోసం రైతుల ఎదురుచూపు

● నేటికీ కొన్నిచోట్ల మాత్రమే వరినాట్లు ● పెరిగిన పెట్టుబడులతో రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి- గన్నవరం : గన్నవరం మండలంలో చినుకు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. జూలై వచ్చిన పొలాల్లో పెద్దగా సాగు కనపడడం లేదు. సాగు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. జూన్‌లో వర్షాలు బాగా పడి సాగు ఉదతంగా జరిగేది. ఈసారి నాట్లు ప్రక్రియ ఆగస్టు రెండో వారంలో మొదలవుతోందని రైతులు చెబుతున్నారు. ఏలూరు కాలువకు నీరు వదలని కారణంగా డెల్టా రైతుల సాగుకు బ్రేక్ పడింది. ఏనాడు లేని విధంగా ఈసారి నీరు అందక నాట్లు పడతాయా? లేదా? అని అనుకుంటున్నారు. బోర్ల నీటిని మళ్లిస్తున్నారు. దానికి అదనంగా వ్యయం చేయాల్సి వస్తుందని అంటున్నారు. మం డలంలోని దావాజిగూడెం, అల్లాపురం, కేసరపల్లి, అజ్జంపూడి, జక్కులనెక్కలం, సావరగూడెం, అప్పారావుపేట, బుద్ధవరం, బూతిమిల్లిపాడు గ్రామాలు డెల్టా కింద ఉన్నాయి. వీటిలో 17,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. కాలువలకు నీరు వస్తే వెంటనే పనులు చేపడతారు. ప్రతికూల వాతావరణం వల్ల నాట్లు ప్రక్రియ నెల రోజులు ఆలస్యమవు తోంది. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 170 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. వర్షాలు పడితే మొత్తంగా వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నీటి కొరతతో ఆయిల్ ఇంజన్లు వాగుల్లో పెట్టి పొలాలకు నీరు పెడుతున్నారు. తర్వాత బురదలో నాట్లు వేయుట జరుగుతోంది. బుద్ధవ రం, కేసరపల్లి, వాజిగూడెం, అజ్జంపూడి గ్రామాల్లో మాగాణి భూములు దుక్కులు దు న్ని ఖాళీగా దర్శినమిస్తున్నాయి. నీరు లేకపోవడంతో నాట్లు పడటం లేదు. కొందరు ఇంజన్లతో నీటిని పొలాలకు తరలిస్తున్నారు. అందులో ఉన్న నారును కూడా తొక్కిస్తున్న పరిస్థితి ఉంది.

వరి సాగు చేసేందుకు దుక్కిలు దున్నిన రైతులు

ఆలస్యమైనా సాగు చేద్దామనే ఆలోచనలో ఉన్నారు. నారుకు ఎకరానికి రూ. 3000 నుంచి రూ. 4000లు వరకు ధర చెల్లిస్తున్నారు. కూలి రేట్లు కూడా పెరిగాయని రైతులు తెలిపారు. గతేడాదితో పోల్చితే పెట్టుబడులు ఖర్చు పెరిగిందని చెప్పారు. ఇక కూలీ ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి నాట్లు వేయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.100 అదనపు భారం పడిందంటున్నారు . నీరు కొరత మరింత దిగాలు పడేలా చేస్తోంది. ఆయిల్ ఇంజన్లు పెట్టడంతో ఎకరానికి రూ.1500 నుంచి 2 వేలు ఖర్చు అవుతోందని కర్షకులు తెలిపారు. బాగా వర్షాలు పడితేనే వ్యవసాయం జోరుగా సాగుతుందని అంటున్నారు. నారు పోసిన ఎదుగుదల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నీరు లేక ఎదుగుదల ఆగిన వరి నారు

వివి ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడికి అవార్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆత్మకూరి లక్ష్మణరావుకు జాతీయస్థాయిలో ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఈనెల 5 6 7 వ తేదీలలో నిర్వహించిన 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్, హైదరాబాదులో నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని ఓవరాల్ ప్రజెంటేషన్ తో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానాన్ని గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ లక్ష్మణరావు డయాబెటిక్ వ్యాధికి సంబంధించిన ఔషధాల పరిమాణాన్ని అంచనా వేసి నిర్దిష్ట పద్ధతులపై చేసిన పరిశోధను ప్రదర్శించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి కొన్ని వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పారిశ్రామికులు పాల్గొనగా అందులో డాక్టర్ ఎ లక్ష్మణరావు ఓరల్ ప్రజెంటేషన్ తో అత్యుత్తమంగా రెండవ స్థానాన్ని సంపాదించుకున్నారు. ముఖ్య అతిథి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీ చైర్మన్ డాక్టర్ బి పార్థసారథి చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమొంటోను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ ఆత్మకూరి లక్ష్మణరావుకు కళాశాల యాజమాన్య సభ్యులు, చైర్మన్ డాక్టర్ వల్లూరు పల్లి నాగేశ్వరరావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరు పల్లి సత్యనారాయణ, కో సెక్రటరీ అండ్ కస్పాండెంట్ వల్లూరు రామకష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని స్థానిక ఈడేపల్లి ఏరియాలో నివాసం ఉంటున్న గుడివాడ కొండబాబుకు మైత్రీ ఫౌండేషన్ ఆదివారం ఆర్థిక సహాయం అందజేసింది. సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొండబాబు ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి పడిపోవడంతో పక్క టెముక విరిగి 3 నెలల నుండి మంచానికే పరిమితమయ్యాడు. ఇల్లు కూడా గడవక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. సోషల్ మీడియా ద్వారా మైత్రీ ఫౌండేషన్ ను సాయం కోసం సంప్రదించగా వెంటనే స్పందించిన ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబానికి వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 10,000 నగదు, 2 నెలలకు సరిపడా నిత్యావసర సరుకుల వితరణ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మైత్రీ ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె వేణు కుమార్, కార్యదర్శి రాధాకష్ణ, సభ్యులు నిరంజన్ రావు, రమాదేవి, అదిశేషు,మురళి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరంతా రోడ్డుపైనే...

● డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రాయనగర్లో సిమెంట్ రోడ్డు కి రెండువైపులా డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో ఇళ్లలోని మురుగంత రోడ్డుపైకి చేరుతోంది. చిన్నపాటి వర్షం పడితే రోడ్డు చెరువులా మారిపోతుంది. పంచాయితీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గత ఏడాదికాలంగా ఈ రోడ్డుపైకి మురుగునీరు వస్తుండ ంతో దోమలు ప్రభలుతున్నాయి. పందులు సైర విహారం చేస్తున్నాయి. దీంతో అంటు రోగాలు ప్రబలుతాయి అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్మికులు డ్రైనేజీలో కూడిక తీసిన నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో చిన్నపాటి వర్షాలు కురిసినా డ్రైనేజీ నిండిపోయి మురుగంతా రోడ్డుపై చేరి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. స్థానికుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. మురుగు నీటిలో నడిచి వెళితే చర్మ రోగాలు వస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికే స్థానికులు జ్వరాల బారిన పడిన పరిస్థితి ఉంది. నిత్యం స్కూలుకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుపై మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాయ నగర్ లో చెరువుగా మారిన రోడ్డు

సాయం అందిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండల పరిధిలోని భావదేవరపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మలిశెట్టి వెంకటేశ్వరరావు పూరీలు అగ్ని ప్రమాదంలో కాలిపోగా గ్రామస్తులు జనసైనికులు సమీకరించిన రూ. 50 వేలతో పాటు శ్రీకష్ణదేవరాయ సంఘం ద్వారా రూ 10,000 మొత్తం ఆర్థిక సహాయాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ చేతులు మీదుగా అందజేశారు. ఆదివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ తో కలసి వెంకట్ రామ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఈ నగదును అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోగాది చిన్నారి, మురారి, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, బుచ్చిబాబు. జనసైనికులు పాల్గొన్నారు

విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) : మొవ్వ గ్రామంలో శనివారం రాత్రి జరిగిన విజయోత్సవ ర్యాలీలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలన్నీ చూశానని, ఆ సమస్యలన్నీ పరిష్కరించి.. నియోజకవర్గాన్ని అభివద్ధిలో మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, మచిలీపట్నం పార్లమెంట్ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, తాతినేని చిన్న పూర్ణ , గ్రామ అధ్యక్షులు ఈడే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధనశ్రీ

కార్మిక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో సిఐటియు మండల కమిటీ సమావేశం గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆకునూరి వెంకటేశ్వర అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ధనశ్రీ పాల్గొని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈనెల 10వ తారీకు భారత దేశ వ్యాప్తంగా సిఐటియు ఇతర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు కార్మికుల డిమాండ్స్ డే నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.అనంతరం ధనశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులు గా తీసుకొచ్చారని, ఈ విధానాల వల్ల సమ్మె చేసే హక్కులు కాలరాసే విధంగా ఈ కోడ్‌లుఉన్నాయని దుయ్యబట్టారు. కొత్తగా అమలైన కార్మిక చట్టాలను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు కొమ్మలపాటి రవి, నానాజీ, కాగిత శ్రీనివాసరావు, రామకష్ణ, గుత్తికొండ శ్రీనివాసరావు, వాసంశెట్టి గణేష్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలోని విత్తనాలు షాపుల్లో వ్యవసాయ శాఖ అధికారులు డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రబాబు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పెంచల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాకు, రిజిస్టర్ షాపులో ఉన్న సరుకు వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు విత్తనాలు అమ్మాలని డీలర్లు సూచించారు. అధిక ధరలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని తీసుకున్న రసీదులను భద్రంగా దాచుకోవాలని సూచించారు. జగ్గయ్యపేట ఏడిఏ భవాని. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - తిరువూరు : పేద విద్యార్థులకు తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులకు రూ.10 వేల విలువగల పుస్తకాలను ఆదివారం అందజేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 8,9 తరగతులు చదువుతున్న తిరువూరు పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థులు షేక్ కరీముల్లాబాబా, యాసిఫ్ ఇమ్రాన్‌లకు జూనియర్ కళాశాలలో 1995-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ వంతు తోడ్పాటు అందించారు.. ఇద్దరు విద్యార్థులకు అవసరమైన రూ.10 వేల విలువ చేసే పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. భవిష్యత్తులో మరింత ఆర్థిక తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కంచడపు రమేష్, షేక్ మొహిద్దీన్, తాతా విష్ణు, పరసా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న తెలంగాణ ఎంపి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి దర్శించు కున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఎఇఒ శ్రీ తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- నందిగామ : భార్య పిల్లలు లేరని దిగులుతో నందిగామలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నందిగామ పట్టణంలో చారి అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నందిగామ పట్టణంలో జయ సిద్ధార్థ స్కూల్ దగ్గరలో నివాసం ఉంటున్న శ్రీరాములు పైడా చారి (36) నందిగామలో అద్దెకు తన తల్లితో ఉంటున్నారు. మృతుడు భార్యకు తనకు మనస్పర్థలు వచ్చి ఒక సంవత్సరం కాలం నుండి విడిగా ఉంటున్నట్టు సమాచారం. అప్పటి నుండి తన భార్య ఇద్దరు పిల్లలు మీద దిగులుతో ఉరి వేసుకొని మృతిచెందినట్టు మృతుని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడుల్లో గాయపడిన బాధితులకు సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి, జనసేన వారు జరిపిన దాడుల్లో గాయ పడడమే కాకుండా ఆస్తి నష్టం జరిగిన పలువురు వైసిపి కార్యకర్తలకు ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను రూ.3.50 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బి కన్వెన్షన్ లో ఆదివారం జరిగిన సమావేశంలో కార్యకర్తలకు చెక్కులను అందజేశారు. దాడుల్లో ఆస్తి నష్టపోయిన తొర్రగుంటపాలెం కు చెందిన పార్టీ సాంబశివరావుకు రూ.లక్ష, దాడుల్లో గాయపడిన అనిగండ్లపాడు గ్రామ సర్పంచ్ జ్యోతి బ్రహ్మంకు రూ 50వేలు, నవాబుపేట గ్రామానికి చెందిన పిల్లి నెహ్రూ కు రూ.50వేలు, తొర్రగుంటపాలెంకు చెందిన పసుపులేటి గోపికి రూ.50వేలు, విద్యానగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్ తల్లికి రూ.50వేలు, డబ్బాకుపల్లి చెందిన నాగేశ్వరరావుకు రూ.50వేలు అందజేశారు.

చెక్కులు అందజేస్తున్న దృశ్యం

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ వి.ఆర్.కె నగర్ మహిళ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి రాజేశ్వరిని అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ సభ్యురాలు డాక్టర్ గంగా విజయ వాణి లయన్స్ క్లబ్ ఆఫ్ విఆర్‌కె నగర మహిళ క్లబ్ విశిష్టతను ఆహ్వానితులందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దేవినేని కిషోర్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ విశిష్టత గురించి వివరించారు. మరో అతిథి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ విఆర్‌కె నగర్ మహిళ సభ్యుల ఐక్యత గురించి సాధించిన విజయాల గురించి చేసిన సేవలు గురించి వివరించారు. మరొక అతిథి దుర్గా మల్లేశ్వర రావు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో

ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఇంజినీర్ సుభాష్ మాట్లాడుతూ ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సంవత్సరం ఇంకా ఎక్కువగా క్లబ్ సేవలు విస్తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాస్టర్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ దేవినేని జోనికుమారి, ఆర్.సి.జండి జ్యోతి, జెడ్.సి గట్టి లక్ష్మీ పాల్గొన్నారు.

10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, తదితర డిమాండ్ల సాధనకు 10న జరిగే డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సి హెచ్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఆటో, ముఠా, లారీ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును తిరిగి ప్రారంభించాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 10న మండల కేంద్రాలు, పారిశ్రామిక కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల కరపత్రాన్ని కార్మికులందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎం.మహేష్, హెచ్‌పి గ్యాస్ ముఠా వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు గోపి కృష్ణ, సూరిబాబు, ఎలియా రాజు, ప్రసాద్, బాలకృష్ణ, సాంబశివరావు, కాశేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని గెలిపించినప్పుడు ప్రజ అభిమానాన్ని స్వీకరించామని అలాగే ఓటమి చెందినప్పుడు వారి అభిప్రాయాన్ని స్వాగతిస్తున్నామని ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కోదాడ రోడ్డు బి కన్వెన్షన్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు వేలాదిగా పాల్గొనగా ఉదయభాను పార్టీ ఓటమిపై వ్యక్తిగతంగా పలువురు అభిప్రాయాలను తెలియజేయాలని కోరగా పలువురు వారి అభిప్రాయాలను తెలిపారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందడంతో పాటు నియోజకవర్గంలో కూడా పార్టీ ఓటమి చెందడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో 25 సంవత్సరాలు సర్పంచ్ గా పనిచేసిన తమ తండ్రి సామినేని విశ్వనాథం హయాం నుంచి పట్టణంలో కొన్ని బలమైన వార్డులు తమకు ఉన్నాయని అలాంటి వార్డులలో కూడా టిడిపికి మెజార్టీ రావడం గమనార్హం అన్నారు. ఈవీఎం మిషన్లపై కూడా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు.

మున్నలూరులో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రజల ఆశలకు అనుగుణంగా చంద్రబాబు పాలన ఉంటుందని నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య అన్నారు. ఆదివారం మున్నలూరు గ్రామంలో పర్యటించారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అనంతరం మొట్టమొదటిసారిగా విచ్చేసిన ఎమ్మెల్యే సౌమ్య గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలు తప్ప ప్రజలకు ఒరిగింది శూన్యమని విమర్శించారు. పర్యటనలో కూటమి నాయకులు, కార్యకర్తలు సౌమ్యకు గజమాలలతో స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అదే గ్రామంలో రైతు సాగుకు ఉపయోగపడే శ్రీ సంగమేశ్వర పంపింగ్ స్కీమ్‌ను పరిశీలించారు.

ఆర్ఐ శ్రీనివాసరావు సస్పెన్షన్

ప్రజాశక్తి - విజయవాడ : సిటీ సెక్యూరిటీ వింగ్‌లో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.శ్రీనివాసరావును నగర పోలీసు కమిషనర్ పిహెచ్‌డి.రామకృష్ణ ఆదివారం సస్పెండ్ చేశారు. తన క్రింది మహిళా సిబ్బంది పట్ల శ్రీనివాసరావు అనుచితంగా వ్యవహరిస్తున్నారని వచ్చిన ఆరోపణలపై విచారించిన పోలీస్ కమీషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆర్ఐ ఎ.శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం క్రైమ్ ఎ.సి.పి.స్రవంతి రాయ్‌కు ఆదేశాలిచ్చారు.

టెంట్ హౌస్ సామాను వితరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : తాతకుంట్ల గ్రామం వీరభద్ర దళితవాడ ప్రజలకు ఎన్ఆర్ఐ గిరి ఆదివారం టెంట్‌హౌస్ సామాను వితరణ చేశారు. గతంలో ఈ సహాయాన్ని చేస్తానని చెప్పిన గిరి ఈ మేరకు సామాను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గిరిని శాలువాతో సత్కరించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు మేడ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మట్ట వణుగోపాల్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, ఆర్.బి.ఎస్ జాతీయ అధ్యక్షులు గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు(బుడ్డయ్య) తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజా పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు కాపాడాలని వినతి

ప్రజాశక్తి- భవానీపురం : సుమారు 20 సంవత్సరాలు క్రితం కొనుగోలు చేసిన తమ ఇళ్ల స్థలాలను కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ ఏకలవ్యనగర్ ఎదురుగా గల ఆర్టీసీ సుబ్బారావు కాలనీవాసులు విన్నవించుకున్నారు. ఆదివారం రామరాజ్యనగర్ విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న ప్లాట్ల వద్ద కాలనీ వాసులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ నివాసితులు తంగా రవికుమార్, జెవి రాజు, వెంకటరమణయ్య, విజయలక్ష్మి మాట్లాడుతూ 2001లో షేక్ మజీద్ అనే వ్యక్తి ఏకలవ్య నగర్ ఎదురుగా గల 8/4 సర్వే నెంబర్ లో గల 2 ఎకరాల 17 సెంట్లు భూమిని ఇళ్ల స్థలాలు ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెడితే వారి దగ్గర 42 మందిమి కొనుగోలు చేసుకుని ఇల్లు కట్టుకున్నామని చెప్పారు. 2001లో తాము ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకు న్నప్పుడు ఎటువంటి అభ్యంతరాలు లేవని చెప్పారు. ఈ నేపథ్యంలో తమ కాలనీవాసులకు ఇటీవల కొత్తగా నోటీసులు రావడంతో దిగ్భ్రాంతికి గురై నలుగురు గుండెపోటుతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో కాలనీ వాసులు

సూర్య హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : సూర్యా హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత సూర్య కిరణ్ ఆకుల వెలగలగూడెం గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి మల్లెల కారుణ్య సాగర్‌కి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సూర్య కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సాగర్ చదువులో రాణించి అధిక మార్కులు సాధించాలన్నారు. పదో తరగతి వరకు ఆర్థిక సహాయాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

కాల్వ పూడికతీత

ప్రజాశక్తి - తిరువూరు : కొమ్మిరెడ్డిపల్లిలోని గుర్రపు వాగు కాల్వ పూడిక తీత పనులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన సొంత నిధులతో చేపట్టారు. ఈ పూడికతీత పనులు ఎంపిటిసి నామ గోపాల్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దొడ్డ మాధవరావు ఆదివారం ప్రారంభించారు. ఈ కాల్వ పూడిక తీయడం వల్ల గొల్లగూడెం, ముష్టికుంట్ల, చింతలపాడు, కొమ్మి రెడ్డిపల్లి చెరువులకు నీరు పుష్కలంగా వస్తుందని ఎంపిటిసి సభ్యులు తెలిపారు. ఫలితంగా సుమారుగా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఐదు సంవత్సరాల నుండి ఈ కాల్వ పూడికతీత గురించి పట్టించుకున్న నాథుడు లేడని, ఎంఎల్ఎ ఈ విషయం తెలుసుకుని తన సొంత డబ్బులతో పనులు చేయించడం పట్ల రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతలపాడు గ్రామ సర్పంచ్ చాట్ల దానయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలంలోని పరిటాల సచివాలయంలో అత్తులూరి కమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలందించారు. శిబిరంలో మహిళలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీటితో పాటు గుండె జబ్బు ఉన్నవారికి బిపి, షుగర్, ఈసీజీ, టూడి ఈకో తదితర పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ రిక్రూట్‌మెంట్ మెంబర్ సెక్రటరీ శ్రీనివాసరావు ప్రారంభించారు. సుమారు 100 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు, సర్పంచ్ వై.ఆనంద జ్యోత్స్న, మాగంటి చిన్న పుల్లారావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగా జోషి, ట్రస్ట్ ఫౌండర్ అత్తులూరి రవికుమార్, డాక్టర్ ఇమ్మానియేల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
7
సోమవారం 8 జూలై 2024

బాబాలు, స్వాములపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గుంటూరు : మూఢత్వాన్ని, మత విశ్వాసా లను సొమ్ము చేసుకునే డేరా బాబాలు, భోలే బాబాలు, స్వాములోర్లు ప్రతి ఊరు, నగరంలో కొత్త రూపాల్లో దర్శనమిస్తునే ఉంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ విజ్ఞిప్తి చేసింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శాస్త్రీయ ధృక్పథాన్ని అలవర్చాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంచాలని సంస్థ కోరింది. సనాతన ధర్మం, అంథ మత విశ్వాసాల పేరిట కాలం చెల్లిన వైదిక వ్యవస్థను పునరుద్ధరించే యత్నాలు తీవ్రంగా జరుతున్నాయని సంస్థ ఆందోళన వెలిబుచ్చింది. అంతరిక్షం నుండి మట్టిన పరీక్షల కోసం నేలకు తెస్తుంటే మరోవైపు బాబాల పాద ధూళి కోసం తాపత్రయ పడడం బాధాకరమని పేర్కొంది. దేశ ప్రధానే తాను దైవదూతనని చెప్పడం ఆందోళన కరమని పేర్కొంది. దేవునికి ప్రతినిధులమని చెప్పుకుంటూ విద్వేషాన్ని రగిల్చేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ కోరింది.

కూటమి గెలిచినందుకు పాదయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంగళగిరిలో నారా లోకేష్ భారీ మేజార్టీతో గెలవడం పట్ల గుంటూరు జిల్లాకు చెందిన శాలివాహన సంఘం సభ్యులు మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఆదివారం పూజలు చేశారు. గుంటూరు జిల్లా శాలివాహన సంఘం ఉపాధ్యక్షులు పారేళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో 117 మంది శాలివాహన సంఘం సభ్యులు గుంటూరు నుంచి మంగళగిరికి పాదయాత్రగా వచ్చి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరిలో పోటీ చేసిన నారా లోకేష్ అఖండ మెజారిటీతో గెలవాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఎన్నికల ముందు మొక్కుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోటప్పకొండ సత్రం ఉపాధ్యక్షులు ఎం.యమలరాజు, నాయకులు ఎం.శివప్రసాద్, జి.ఆంజనేయులు, ఎ.యమున, కె.ఆదిలక్ష్మి, ఎన్.శివరామ కృష్ణ, జి.రాఘవ, బి.ప్రసాద్, చిరంజీవి, కె.అంజిబాబు, బి.శంకర్, కె.వీరాంజనేయులు, పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర గణనీయమైనది : మంత్రి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర గణనీయమైనదని రాష్ట్ర గనులు భూగర్భ జల ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక జార్జ్ కారనేషన్ హైస్కూల్లో ఆదివారం మచిలీపట్నం నియోజకవర్గస్థాయి ప్రధానోపా ధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం ద్వారా మంచి సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ కషిలో ఉపాధ్యాయులు వారియర్స్ అని మంత్రి అభివర్ణించారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలో ఉంటారని, వారి నడవడిక ప్రవర్తన విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని, తల్లిదండ్రుల బాధ్యత కూడా తీసుకుని వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధికంగా నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దష్టికి తీసుకురావాలని సూచించారు. తొలుత మంత్రి పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఈ సమావేశంలో స్థానిక జన సేన నాయకులు బండి రామకష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి తహెరా సుల్తానా, ఉప విద్య శాఖ అధికారి శేఖర్ సింగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సీతాదేవి, ప్రధానోపాధ్యాయులు తిరుమల సుబ్బారావు, నియోజకవర్గ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్వర్ణాంధ్ర నగర్, భారత్‌పేట, గుజ్జనగుండ్ల, వెంగళరావు, కొండా వెంకటప్పయ్య కాలనీలోని అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలలకు సబ్జెక్ట్ టీచర్లు, ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని యుటిఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు, హెచ్ఎం పోస్టులు లేక సెకండరీ గ్రేడ్ టీచర్లతోనే బోధన, పరిపాలన బాధ్యతలు చేయిస్తున్నారని, గత ఐదేళ్ల నుండి ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది పదో తరగతి పూర్తి చేస్తున్న ఈ హైస్కూల్స్‌లో అవసరమైన టీచర్ పోస్టులు మంజూరు చేయకపోటం శోచనీయమని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్జెక్టు టీచర్లు, హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

కవితల పోటీల్లో 9 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు : అమరావతి సాహితీ మిత్రులు సంస్థ వారు ఫేస్‌బుక్ గ్రూపులో అంతర్జాతీయ స్థాయిలో వారం వారం నిర్వహిస్తున్న కవితల పోటీల్లో భాగంగా ఈ వారం నిర్వహించిన కవితల పోటీల్లో 9 మంది పంపిన మినీ కవితలకు ప్రశంసాపత్రాలు లభించాయని సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉచితాలు' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో 55 మంది కవితలు పంపించగా వివిధ జిల్లాలకు చెందిన కాయల నాగేంద్ర, సంబరాజు రమణి, చిత్తలూరి, గోలి హనుమశాస్త్రి, సింగరాజు శ్రీనివాసరావు, మైథిలి, ఎనికేపల్లి శివకుమార్, దినవహి సత్యవతి, సుధా కోసూరి ఎంపికయ్యారని తెలిపారు.

10న కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-గుంటూరు : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గుంటూరు నగర ముఠావర్కర్స్ యూనియన్ టింబర్ ముఠా కార్మికుల విస్తృత సమావేశం జీటీ రోడ్డులోని ఆదివారం నిర్వహించగా శ్రీనివాసరావు మాట్లాడారు. పదేళ్ల నుండి ముఠా కార్మికులకు సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవట్లేదన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగితే పట్టించుకునే వారే లేరన్నారు. కనీసం మౌలిక సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేక ముఠా కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. యజమానులు స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో చెల్లించని యజమానులకు గతంలో పెనాల్టీలు ఐదు శాతం నుండి 20 శాతం వరకు విధించే వారని, నూతన చట్టం ప్రకారం ఒక శాతం నుండి 5 శాతం వరకు పెనాల్టీలను తగ్గించటం సరికాదన్నారు. దీనివల్ల భవిష్యత్తులో కార్మికులకు పిఎఫ్ అందే పరిస్థితి లేదన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు.

బీసీ ప్రజాప్రతినిధుల్ని సన్మానిద్దాం

సిఎం, డిప్యూటీ సిఎంనూ సత్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - మంగళగిరి : ఇటీవల ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచిన బీసీలైన వారిని, మంత్రుల్ని ఘనంగా సన్మానించాలని బీసీ సంక్షేమ సంఘం తీర్మానించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయితోపాటు జిల్లాస్థాయిలోనూ భారీ ఎత్తున సన్మాన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గంలోకి ప్రతి జిల్లా నుండి ముగ్గురుని కో-ఆప్ట్ చేసుకుంటున్నట్లు, జిల్లా కార్యవర్గాలలో మార్పులు-చేర్పులు చేస్తూ, అన్ని జిల్లాల్లో సంఘాన్ని మరింత విస్తృతం చేసేందుకు కషి చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. అనుబంధ సంఘాలను, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు అనుబంధ విభాగాలను రాష్ట్ర, జిల్లా స్థాయిలలో, రాజకీయ పార్టీలకు ధీటుగా పటిష్టంగా నిర్మాణం చేయాలని తీర్మానించామని చెప్పారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, మంత్రి లోకేష్‌ను సంఘ రాష్ట్ర నాయకత్వం కలిసి సన్మానించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు శంకరరావు తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈనెల 15న రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పుట్టినరోజును అన్ని యోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించాలని, సమావేశం తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మ జ్యోతిబా పూలే బీసీ భవన్‌ల నిర్మాణం కోసం, అన్ని జిల్లాల కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలను అందజేయాలని తీర్మానించామన్నారు. రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మానంద శర్మ మాట్లాడుతూ విజయవాడ-గుంటూరుల మధ్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా, మహాత్మ జ్యోతిబా పూలే-సావిత్రిబాయి పూలేల స్మృతి వనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానించామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి.సోమరాజు, బీసీ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.మహేష్ పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న కేసన శంకరరావు

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉమ్మడి జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మ వారిని యాత్రికులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించు కున్నారు. సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కు బడులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన యాత్రలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన కార్య నిర్వహణాధికారి కానూరు సురేష్ బాబు ఏర్పాట్లు పరిశీలి ంచారు.

ఆందోళన చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

బ్యాంకు అధికారులు దౌర్జన్యం ఆపకపోతే పోరాటం ఉధృతం

గుడివాడ: బ్యాంక్ అధికారులు దౌర్జన్యం అపకపోతే పోరాటం ఉదతం చేస్తామని టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ కార్యకర్తల విస్తత సమావేశంలో కార్యదర్శి బసవ అరుణ హెచ్చరించారు. ఆదివారం టిడ్కో కాలనీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడ్కో కాలనీలో యూనియన్ బ్యాంక్ మిగిలిన బ్యాంక్ లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రూ.30 వేలు 40 వేలు కట్టాలని లేకపోతే తాళాలు వేస్తామని బెదిరిచటంతో రాత్రి మూడు అంతస్తులు ఎక్కి భార్య భర్తలు ఆత్మహత్యకు పాల్పడబోయరని, దీంతో చుట్టూ పక్కల వారు అపారని అన్నారు. మరో కుటుంబం ఇంట్లో వుండి లోపల పెట్టి తాళం వేయటానికి బ్యాంక్ వారు ప్రయత్నించారని, ఇది ఎంత వరకు సమంజసం అన్నారు. బ్యాంకు అధికారులు ఈ వేదింపులు ఆపకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఆర్.సంగమ్మ, సహాయ కార్యదర్శి సయ్యద్ నూరున్నిసా, ఉపాధ్యక్షులు ఆదినారాయణ...దొడ్ల రమణమ్మ ,మేరమ్మ, రంగారావు చినమ్ములు వీరస్వామి బ్రహ్మయ్య షేక్ గౌస్ హైమవతి,కన్యా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : పూషడుపు మహాలక్ష్మి వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తెలు తోట సీతారామమ్మ, గాజుల భారతి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక నిమ్మలతోట లోని సీయోను వద్ధాశ్రమం లో ఆదివారం అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు, తోట శామ్ కుమార్, పూషడపు చైతన్య, పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి తొడేటి నాగరాజు,గ్రామ రెవెన్యూ అధికారి మత్తి గోపాలకష్ణ ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కర రావు లు పాల్గొన్నారు.

నేడు కలక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగు తుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఫారమ్స్ వ్యాపారులతో సమావేశమైన ప్రదీప్

కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా గుర్తించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కోళ్ల పెంపకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహించలనీ ప్రదీప్ ఫారమ్స్ వ్యవస్థాపకులు ఇంటి ప్రదీప్ కోరారు. ప్రదీప్ ఫర్మ్స్ ఆధ్వర్యంలో నాటు కోళ్ల పెంపకం అభివృద్ధిలో భాగంగా 250 మంది రైతులతో కలిసి ప్రదీప్ ఫారమ్స్ వ్యవస్థాపకులు ఇంటి ప్రదీప్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోళ్ల పెంపకం, నాటు కోళ్ల వ్యాపారం అనేది రోజు రోజుకి పెరుగుతుందనీ అన్నారు. వేల కుటుంబాలు వీటిని జీవనాధారంగా చేసుకుంటున్నారు. ప్రభుత్వం దీన్ని కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. కోళ్ల పందాలను కూడా అదే తరహాలో చట్ట భద్రత కల్పిస్తే వేల కుటుంబాలు ఆర్థికంగా ముందుకు వెళ్తాయని చెప్పారు. కోళ్ల పరిశ్రమలో ఉన్న పెద్ద వాళ్లతో కలిసి ప్రభూత్వం దృష్టికి తీసుకు వెళ్ళడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తమిళనాడు తరహా ఉద్యమం చేసి అయిన కోళ్ల పందాల చట్టభద్రత కోసం పోరాడతామనీ చెప్పారు. 300 మంది కోళ్ల రైతులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రం నలుమూలల నుంచి అందరూ అందారు దీన్ని ముందుకు తీసుకు వెళ్ళ డానికి సిద్ధంగా ఉన్నారనీ తెలిపారు.

అతిసార కేసు ఒకటి నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ప్రాంతంలో ఆదివారం ఒక డయేరియా కేసు నమోదయింది. జగ్గయ్యపేట పట్టణం బంగారుపేటకు చెందిన భవాని శంకర్ అనే బాలుడు డయేరియా బారిన పడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా అదుపులో ఉందని, మొత్తం ఇప్పటివరకు జగ్గయ్యపేట ప్రాంతంలో 150 డయేరియా కేసులు నమోదు అయ్యాయని తెలిపారు.

మన జై భారత్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో నూతనంగా నెలకొల్పిన మన జై భారత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆదివారం సాయంత్రం నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. రెస్టారెంట్ నిర్వాహకులు ఎన్.వీరబాబు నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రెస్టారెంట్ నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు ఎన్ వీరబాబు మాట్లాడుతూ మన జై భారత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో అందుబాటు ధరలలో నాణ్యమైన, మన్నికైన, రుచి, శుభ్రత కలిగిన తందూరి బిర్యానీ, మండీ బిర్యానీ, చైనీస్, ఇండియన్ స్పెషల్, మాక్ టైల్, మిల్క్ షేక్, ఐస్ క్రీమ్స్ లభిస్తాయని తెలిపారు. విజియన్ ఆర్గానిక్ ఐటమ్స్ మా ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ ప్రముఖులు కాకతీయ అపోలో విద్యా సంస్థలు అదినేత కాపా రవీంద్రనాథ్, కాపా భాను ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, కౌన్సిలర్ శాఖమూరు స్వర్ణలత, గొల్లపూడి కృష్ణా రావు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సౌమ్య

'అమ్మ' ప్రోత్సాహం ఉన్నత శిఖరాలకు బాసట

జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : భావి భారత పౌరులైన విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించేందుకు ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) అందిస్తున్న ప్రోత్సాహంతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ సృజన అన్నారు. ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మ కళ్యాణమండపంలో పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రవాణా రంగానికి ఎంతో కీలకమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిన విజయవాడ నగరంలో 'అమ్మ' విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో విలువైందన్నారు. 25 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఏటా విద్యార్థులకు ఉపకారవేతనాలను స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది 418 మంది విద్యార్థులకు రూ.16 లక్షల రూపాయల ఉపకార వేతనాలు పంపిణీ, రెండు ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలందించడం గొప్ప విషయమన్నారు. మొగల్రాజుపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ పాఠశాలలను దత్తత తీసుకుని ముగ్గురు కంప్యూటర్ టీచర్లకు జీతాలను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులను చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటోనగర్, గవర్నపేటలలో ఆటోమొబైల్ షాపులలో పనిచేసే సిబ్బంది, కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 1999వ సంవత్సరం నుండి ఇప్పటివరకు రూ.కోటికి పైగా ఆర్థిక సహాయాన్ని, నోట్ పుస్తకాలను అందించినట్లు తెలిపారు. కానూరులో రూ.60 లక్షలతో వృద్ధాశ్రమాన్ని నిర్మించి 40 మంది వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎన్ఆర్ఐ వైద్య కళాశాల డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కె.వి.ఎస్. కుమార్ చౌదరి, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల డీన్, నేత్ర విభాగం హెచ్.ఓ.డి. ప్రొఫెసర్ లక్ష్మీ చౌదరి వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు గారపాటి సతీష్ బాబు దోనేపూడి దుర్గాప్రసాద్, యార్లగడ్డ సుబ్బారావు, అసోసియేషన్ సభ్యులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిఆర్‌సిలో నష్టాన్ని పున:సమీక్షించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్, రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం స్థానిక డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సామ్యూల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి కార్యవర్గ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. విద్యుత్ సంస్థలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,500 ఖాళీలను దృష్టిలో ఉంచుకొని, నూతనంగా కొలువైన కూటమి ప్రభుత్వం ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకుని విద్యుత్ సంస్థల్లో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రజలకు సేవ అందించుటలో విద్యుత్ సంస్థలను ముందు వరుసలో నిలబెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌సిని మరొకసారి సవరించి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఇంజనీర్లకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని గత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర కార్యవర్గం ముక్తకంఠంతో ఖండించింది. విద్యుత్ సంస్థలో ట్రస్ట్ కు జమ చేయాల్సిన నిధులను జమ చేయకపోవడం వలన ఏర్పడిన భారాన్ని ఎంప్లాయిస్ కాస్ట్ పెరుగుదలగా చూపించి ఉద్యోగులపై రుద్దాలని చూసి

సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ఎంప్లాయి కాస్ట్ ఎక్కువగా ఉందనే నెపంతో తీవ్ర అవకతవకలకు పాల్పడింది. విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్, పరికరాలపై వచ్చిన నష్టాన్ని సైతం అదనపు భారంగా ఉద్యోగులపై చూపించి తీవ్ర నష్టం చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శామ్యూల్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వి.రామారావు, జనరల్ సెక్రెటరీ నాగ ప్రసాద్, జెన్కో వైస్ ప్రెసిడెంట్ కె.ప్రశాంత్‌కుమార్, స్థానిక డాక్టర్ ఎన్‌టిపిఎస్ బ్రాంచ్ సెక్రటరీ కె.వి.ఆర్ చక్రపాణి కోశాధికారి యు.వెంకట్రావు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు జనరల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'దీవెన' సాయం

ప్రజాశక్తి- వన్‌టౌన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హాస్పటల్‌లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన బాబు వేదాన్స్, వారి పాప హాస్పిటల్‌లో చాలా ఖర్చు చేసి ఉన్నారు. నహాయం కొరకు తల్లిదండ్రులు రాజేష్, వినీత దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయం మిత్రులు హరిబాబు వారి ఇంటికి వెళ్ళి ఆదివారం అందించారు.

సమస్యల వలయంలో బాలికల వసతిగృహం

ప్రజాశక్తి - మైలవరం : కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న బాలికల కోసం మైలవరంలో నిర్వహిస్తున్న వసతి గృహంలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల్లోని పేదవిద్యార్థినుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వాలు వసతి గృహాలు నిర్వహిస్తున్నాయి. పేరుకే వసతి గృహాలు కానీ ఆ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. గత పది సంవత్సరాల క్రితం మైలవరంలో బీసీ బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో 70 మందికి పైగానే ఉన్న విద్యార్థినుల సంఖ్య క్రమేణా తగ్గుతూ వచ్చింది. అధికారులు అలసత్వమే అందుకు కారణం అని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లుగా మైలవరంలోని పొందుగల రోడ్‌లో ఓ ఇంటిలో బాలికల వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ గృహంలో ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుతున్న విద్యార్థినులు ఉంటున్నారు. గత విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఈ వసతి గృహంలో వార్డెన్ రమాదేవి అలసత్వం కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రెండేళ్లుగా వార్డెన్ వసతిగృహం వైపు చూసిన దాఖలాలు లేవని, భోజనం కూడా సక్రమంగా పెట్టడం లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో విద్యార్థుల సంఖ్య తగ్గటంతో వసతి గృహాన్నిగొల్లపూడికి మారుస్తున్నారని వార్డెన్ హడావుడి చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకోవడంతో ప్రస్తుతం వసతిగృహం మైలవరం, గొల్లపూడి అని డోలాయమానంలో ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, అలసత్వం కారణంగా మైలవరంలోని బాలికల వసతిగృహం పలు విమర్శలకు తావిస్తుందని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. మైలవరం పరిసర ప్రాంతాల్లో 3 ఇంటర్, 2 డిగ్రీ, 2 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. మైలవరం వెనుకబడిన ప్రాంతంగా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు మైలవరం వసతి గృహంలో చేరుతున్నారు. వార్డెన్ అలసత్వం కారణంగా వీరి సంఖ్య రాను రాను తగ్గింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థినిలు కోరుతున్నారు.

వార్డెన్‌ను మార్చాలి

ఎం.దివ్య. జగ్గయ్యపేట బికాం, సెకండ్ ఇయర్, మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మా వసతి గృహంలో వార్డెన్ మాకు కనపడి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తుంది. ముందుగా వార్డెన్‌ను మార్చాలి. అన్నం పెడితే కూర ఉండదు, కూర ఉంటే అన్నం ఉండదు. ఇలా ఉంది మా పరిస్థితి. పేరుకే బాలికల వసతిగృహం కానీ సమస్యలు ఎన్నో ఉన్నాయి. మా సమస్యల గురించి వార్డెన్‌కు తెలియజేస్తుంటే కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు. న్యూ అడ్మిషన్స్ చేర్చుకోవడం లేదు. మా చదువులు మధ్యలోనే ఆపాల్సి వస్తుందని ఆందోళనగా ఉంది.

ఎం మైత్రి. ఒంగోలు. త్రిబుల్ ఈ. లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మైలవరం.

వసతిగృహాన్ని మైలవరంలోనే కొనసాగించాలి

ప్రకాశం, ఒంగోలు జిల్లాల నుండి వచ్చి మైలవరంలో చదువుకుంటున్నాం. ప్రారంభంలో వసతిగృహం బాగానే ఉన్నా రాను రాను వార్డెన్ నిర్వాకంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంటర్ పరీక్షలు అయిపోగానే మిగతా వారిని కూడా వెళ్ళిపొమ్మని బలవంతం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా గొల్లపూడికి మారుస్తున్నామని మీరు ఉంటే డబ్బులు కట్టాల్సి ఉంటుందని చెబుతున్నారు. మాకు ఏమీ అర్థం కావడం లేదు. పేరెంట్స్ దగ్గర నుంచి లెటర్లు రాయించుకు రమ్మని ఒత్తిడి చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.